క్లుప్తంగా

విశ్వామిత్రకు ప్రశంసలు



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న హీరో సుమన్

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణకు వాక్ ఫర్ ట్రీస్ కాన్సెప్ట్‌తో ప్రతీరోజు ప్రముఖులతో కలిసి మొక్కలు నాటుతున్న విశ్వామిత్ర చౌహాన్ సేవలను గుర్తించి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు కల్పించారు. నిర్వాహకులు సినీ ప్రముఖుడు సుమన్ చేతుల మీదుగా హైదరాబాద్ త్యాగరాయ గానసభ కళాక్షేత్రంలో ఆదివారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి విశ్వామిత్రకు పలువురు శుభాశీస్సులు అందజేశారు.

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొని మాట్లాడారు. స్వామి వార్ల కృపతో రేగళ్ల ప్రాంతం సస్యశ్యామలం కావాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పేద ముస్లింల కోసమే వక్ఫ్ చట్ట సవరణ



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: వక్ఫ్ బోర్డుకు రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్నా వాటి ఆదాయం పేద ముస్లింలకు దక్కడం లేదని వక్ఫ్ చట్టాన్ని కేంద్రం సవరణ చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వక్ఫ్ కమిటీ సభ్యురాలు మౌనిక సుంకర అన్నారు. స్థానిక పట్టణంలో ఆదివారం జరిగిన మైనార్టీ నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వక్ఫ్ బోర్డులో లక్షల కోట్లు రూపాయల విలువ గల ఆస్తులు ఉన్నాయని వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తుందో, ఎంతమంది పేదముస్లింలకు న్యాయం జరుగుతుందో సీఎం రేవంత్‌రెడ్డి, మజ్లీస్ అధినేత అల్లావుద్దీన్ ఓవైసీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. చట్ట సవరణ ఏ వర్గానికీ కాదు.. మజీదుల నిర్వహణ వేరు, వక్ఫ్ భూముల నిర్వహణ వేరు అన్నారు. ఈ రెండింటినీ కలిపి చెబుతూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయవద్దన్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలో మజీదులు ఉండవన్నారు. ఈ సమావేశంలో సీతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెరువు శ్రీనివాసరావు, కుంజ ధర్మ, కేవీ.మధుసూదన్, ఎస్కే సలీమ్, జల్లారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



జూలూరుపాడు: బిలీవర్స్ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ ఎలీషా

యేసు క్రీస్తు సమాధిలో నుంచి తిరిగి లేచిన రోజు ఈస్టర్ (పునరుత్థాన దినోత్సవం) పురస్కరించుకుని ఆదివారం క్రైస్తవులు చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు, ఫాదర్లు దేవుని వాక్యం వినిపించారు. చిన్నారులు పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: పెంతెకొస్తు చర్చిలో..



ఇల్లెందురూరల్: మామిడిగూడెం చర్చిలో..



ఇల్లెందు: సీఎస్ఐ చర్చిలో...



పాల్వంచ: ఎల్‌జీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

సింగరేణి గనుల వేలంపై ఆందోళన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 22, 25వ తేదీన నిర్వహించనున్న బొగ్గు గనుల వేలం, సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సింగరేణి వ్యాప్తంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాల వాల్‌పోస్టర్లను ఆదివారం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ.. 22న గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ఆయా హెచ్‌ఓడీలకు వినతిపత్రాలు 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి జీఎంలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మ శ్రీనివాస్, గడప రాజయ్య, వసికర్ల కిరణ్, కాగితపు విజయ్‌కుమార్, శనిగరపు శంకర్, ప్రసాద్, కంచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు వై.గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా హమాలీలు, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన, ఆటో, మోటార్ కార్మికులు, మిషన్ భగీరథ, పాఠశాల, హాస్టల్ వర్కర్స్ సుమారు రెండు వేల మంది ఉన్నారన్నారు. కార్మికశాఖ అందించే సౌకర్యాలు సత్వరమే అందాలంటే ఏఎల్‌ఓ కార్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ



కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు



తిలకిస్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్: రామవరంలోని ఆరవ వార్డులోని వేణుగోపాల స్వామి నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు గావూజీ వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకంగా అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

పాల్వంచరూరల్: పాల్వంచ పట్టణంలో విలువైన ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకుని విక్రయించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని బీజేపీ జిల్లా నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను అక్రమించి లేఅవుట్లు చేసిన వారికి మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడంతో వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూమి 999, 817, 444, 727 సర్వే నంబర్ల పరిధిలో ప్రభుత్వ భూమి 400 ఎకరాలు ఉందని గతంలో అధికారులు సర్వే చేసి వెల్లడించినట్లు తెలిపారు. ఇళ్ల లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భట్టు సురేష్, లక్ష్మణ్‌రావు, నరేష్, ప్రశాంత్, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



ఇల్లెందు: జేబీఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగింది. 2004–2006 ఎలక్ట్రీషియన్ ట్రేడ్ చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట చేరి, వారికి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ప్రస్తుతం ఐటీఐలో చదువుతున్న విద్యార్థులకు పూర్వవిద్యార్థులు ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్, స్వామినాథం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని జేబీఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమై నాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్దినేని సాయిచందర్, సందీప్, ఈసం లక్ష్మణ్, సాగర్, పూర్ణచందర్, రామకృష్ణ, ప్రియాంక, స్వాతి, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా..?



సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపల్ అధికారులకు ఇంటి పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని, సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు. ఆదివారం పాత కొత్తగూడెం మూడు వార్డులు, ప్రగతినగర్ 18, 19వ వార్డులలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కనీసం ఎండాకాలంలో కూడా తాగునీటి గోస పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈరోజు ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించామని, పలు సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు తీసుకొని వార్డు సభలు పెట్టి అర్హుల జాబితా ప్రకటించారు కానీ, లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించనే లేదన్నారు. పెన్షన్లు మంజూరు చేయాలని, కొత్తరేషన్ లబ్ధిదారల పేర్లు ప్రకటించారు కానీ కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రతినిధులు వార్డుల్లో సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరన్న, ఆవుల శ్రీరాములు, అలేటి శ్రీను, నాగకృష్ణ, దుర్గమ్మ, శైలజ పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించండి..



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గుడిసెవాసులకు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరేళ్లుగా గుడిసెలు నిర్మించుకొని నివాసం ఉంటున్న తమకు స్థానిక అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని వాపోయారు. పేదలకు తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, వీధిదీపాలు, విద్యుత్ మీటర్లు, ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. పూబెల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని, పట్టణంలోని జేకే కాలనీలో నిర్వాసితులకు ఇచ్చిన క్వార్టర్ల కూల్చివేతను నిలిపివేయాలని కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, వజ్జ సురేష్ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం



మరో సెంటర్‌కు వచ్చిన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఓపెన్ స్కూల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు పలువురు విద్యార్థులు సెంటర్ల పేర్లు తెలియక ఇబ్బందులు పడ్డారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తామని సంబంధిత అధికారులు ప్రకటించినప్పటికీ పలువురు ఆలస్యంగా వచ్చారు. అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. పదో తరగతికి మూడు సెంటర్లు, ఇంటర్మీడియట్‌కు నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. అయితే పలువురు అభ్యర్థులు హాల్ టికెట్‌లో ఉన్న సెంటర్లుకు వెళ్లకుండా సమీపంలోని మరో సెంటర్లకు వెళ్లి తిరిగొచ్చారు. 483 మందికి 398 మంది హాజరు కాగా 85 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు నాలుగు సెంటర్లలో 656 మందికి 579 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజయ్యారు.

ఆర్టీసీ ప్రయాణికులకు నీడ కరువు

సుజాతనగర్: మండలకేంద్రం సుజాతనగర్‌లో ఆర్టీసీ బస్ షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిలువ నీడలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు చుట్టుపక్కల హోటళ్లు, చెట్లను ఆశ్రయిస్తున్నారు. అయితే బస్సులు వచ్చే సమయానికి హోటళ్లలో ఉన్నవారు పరుగులు తీస్తూ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా సుజాతనగర్‌లో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతీరోజు వివిధ పనులపై సుజాతనగర్‌కు వచ్చిపోతుంటారు. అయితే ఇక్కడ బస్సు షెల్టర్ ఏర్పాటును పాలకులు విస్మరించారు. మండల కేంద్రం సుజాతనగర్ నుంచి ప్రయాణించే ప్రజలు, ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు చాలామంది ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బస్సు కోసం ఎండలో నిల్చున్న ప్రయాణికులు

అటెన్షన్ ప్లీజ్

ప్రహరీ నిర్మించరూ...

మండల కేంద్రంలోని పశువైద్యశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేదు. ఉన్నది కూలిపోయే దశలో ఉంది. దీంతో పశువులు, కుక్కలు లోపలికి వస్తున్నాయని చుట్టుపక్కల ఇళ్లవారు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ప్రహరీని నిర్మించాలని కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి: కాత్యాయని
పశువైద్యాధికారి
ఫోన్ నంబర్ 9666350668



బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా..?

- మధ్యలోనే నిలిచిన అలుగు వాగుపై వంతెన పనులు
- మరోమూడు నెలలు అయితే వర్షాకాలమే..



అలుగు వాగుపై అసంపూర్తిగా ఐరన్ వంతెన

ఇల్లెందు: ఇల్లెందులపాడు అలుగు వాగు మీద ఇనుప వంతెన పనులు అసంపూర్తిగా వదిలేశారు. వచ్చే వర్షాకాలం నాటికి అయినా పూర్తయ్యేనా..? అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి. మరోమూడు నెలలు అయితే వర్షాకాలమే వస్తుంది. ఏటా వర్షాకాలంలో శవాలను వాగు దాటించి హిందూ శ్మశానవాటికకు తరలించి ఖననం చేయటం కష్టంగా మారింది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటే ఎక్కువ నిధులు అవుతుండటంతో తక్కువ నిధులతో పనులు చేపట్టాలని భావించారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం సింగరేణి ఆధ్వర్యంలో ఐరన్ బ్రిడ్జి పనులు ప్రారంభించి మధ్యలోనే పనులు వదిలేశారు.

ఐరన్ వంతెన పూర్తయితే ..

అలుగు మీదుగా హిందూ శ్మశానవాటికకు వెళ్లేందుకు రూ.5 లక్షల ఖర్చుతో ఐరన్ వంతెన నిర్మాణం సాగుతోంది. అలుగు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటే కనీసం రూ.50 లక్షలు ఖర్చు అవతుందని అంచనా.. అయితే ఇటీవల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన కోటా నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ నిధులు మున్సిపాలిటీకి చేరేలోపు కనీసం తాత్కాలిక ఐరన్ వంతెన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెంటనే పూర్తి చేయాలి..



అలుగు వాగు బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లు వేసి ఐరన్ పైపులు పరిచారు. ఆ తరువాత ఏం జరిగిందో పనులు నిలిచిపోయాయి. కాలం ముంచుకొస్తోంది ఇప్పటికైనా తక్షణం మిగిలిన పనులు పూర్తి చేయాలి.

– గిరి, ఇల్లెందులపాడు

త్వరలో పూర్తి చేస్తాం..



కొంత కాలంగా వివిధ కారణాలతో పనులు ఆగిపోయాయి. త్వరలో పూర్తి చేయిస్తాం. ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చాం. వచ్చే వర్షాకాలం నాటికి ఇనుప వంతెన మీదుగా వెళ్లేలా చేస్తాం.

–శ్రీకాంత్, కమిషనర్, ఇల్లెందు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

కొత్తగూడెంటౌన్: నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రాలేదని, అర్హులకు ఇల్లు కేటాయించాలని సేవాలాల్ బంజార సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం చిట్టి రామవరం తండాలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి జరగలేదన్నారు. అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. బానోతు హర్షా నాయక్, ఇస్లావత్ ధర్మానాయక్, సీహెచ్ స్వర్ణ, బానోతు కరుణ, ఇస్లావత్ సక్రీ, బానోతు లక్ష్మి, గుగులోతు తులసి, ఇస్లావత్ మహేశ్వరి, అంగోతు విజయ, ఆలకుంట రమణ, గుగులోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

వేసవిలో తాగునీటి ఎద్దడి

- గాంధీనగర్‌లో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పొలాల్లో నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

జూలూరుపాడు: గాంధీనగర్ గ్రామంలో తాగునీటి ఎద్దడితో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం బోరు బావి పూడిపోవడం, చేతి పంపులు మూలన పడటంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వాటర్ ట్యాంకుకు మిషన్ భగీరథ నీళ్లు ఎక్కకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్తే గ్రామాన్ని సందర్శించి వెళ్లారు గానీ, చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పొలాల్లోని బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని గిరిజనులు వాపోతున్నారు. తాగునీటి సమస్య తీర్చాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధీనగర్ గ్రామంలో 80 కుటుంబాలు, 250 మంది జనాభా. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాంధీనగర్‌లో నిరుపయోగంగా మిషన్ భగీరథ ట్యాంకు

శాశ్వత పరిష్కారం చూపాలి..



మూడు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. తాగడానికి నీళ్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పొలాల్లో బోర్ల వద్ద నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– లకావత్ విజయ, గాంధీనగర్

భగీరథ నీళ్లు కూడా రావడం లేదు..



రక్షిత మంచినీటి పథకం బోరు బావి పూడిపోయింది. మిషన్ భగీరథ నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదు. గ్రామంలో ఒక్క చేతి పంపు కూడా లేదు. తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నాం. తాగునీటి సరఫరా నిరంతరాయంగా జరిగేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– భూక్యా కాంతి, గాంధీనగర్

సమస్య పరిష్కరిస్తాం...



గాంధీనగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. రక్షిత మంచినీటి పథకం బోరు బావి పూడిపోయింది. త్వరలో బోరు బావిని ఫ్లెషింగ్ చేయించి, గ్రామమంతా తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం.

– డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, జూలూరుపాడు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416